గురువారం 5 జూన్ 2025

తెలంగాణ గీతం

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 • సంచిక : 71 • పేజీలు : 4 • వెల రూ. 4/-

రంగారెడ్డి, నల్గొండ,ఖమ్మం, మెదక్, యాదాద్రిభువనగిరి,సూర్యాపేట,వరంగల్, నాగర్ కర్నూల్, హైదరాబాద్,వికారాబాద్, మహబూబ్నగర్, జనగాం, ములుగు,

విలేకరులు కావలెను

రిపోర్టర్లు కావలెను తెలంగాణలో తెలంగాణ గీతం తెలుగు దినపత్రిక కోసం జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు మరియు నియోజకవర్గ మరియు మండలాల వారీగా రిపోర్టర్స్ కావలెను సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 8985188834

రాజకీయల్లో రగడ!



- రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీల్లో అంతర్గత పోరు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల్లో రచ్చ
- అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలతో సతమతం
- కాంగ్రెస్‌లో తేలని కేబినెట్ విస్తరణ..ఆశావహుల నిరసన గళం
- పార్టీ పదవుల లొల్లి.. గాంధీభవన్‌లో మహిళా నేతల ధర్నా
- ఎమ్మెల్సీ కవిత రె'బెల్స్'తో బీఆర్ఎస్‌లో దుమారం
- జాగృతి బలోపేతమంటూ పార్టీకి సమాంతరంగా కార్యకలాపాలు
- కమలంలోనూ కలహాలు.. నేతల్లో కొరవడిన ఐక్యత..

హైదరాబాద్

రాష్ట్రంలోని మూడు ప్రధాన పార్టీలు. ఒకటి అధికార కాంగ్రెస్, రెండోది ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్, మూడవది జాతీయ పార్టీ బీజేపీ. ఏ చిన్న అవకాశం దొరికినా ప్రత్యర్థి పార్టీలపై ఆరోపణలు, విమర్శలతో విరుచుకుపడుతుంటాయి. ప్రజల దృష్టిని తమ వైపునకు తిప్పుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. కానీ ప్రస్తుతం.. ఈ మూడు ప్రధాన రాజకీయ పక్షాలూ వేటికవే తమతమ పార్టీల్లో అసమ్మతి స్వరాలు, అసంతృప్తి జ్వాలలు, అంతర్గత కుమ్ములాటలు, విభేదాలతో సతమతమవుతున్నాయి. ఏ పార్టీకి ఆ పార్టీలో లుకలుకలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువని చెప్పే కాంగ్రెస్ పార్టీలో ఇలాంటివి సహజమే అయినా క్రమశిక్షణకు మారుపేరని భావించే బీజేపీ, ఏకఛత్రాధిపత్యం కింద నడిచే ప్రాంతీయ పార్టీ బీఆర్ఎస్‌లో కూడా రాజకీయ రచ్చ కొనసాగుతుండటం గమనార్హం. అయితే గ్రూపులు, గొడవలకు పుట్టినిల్లు లాంటి కాంగ్రెస్ పార్టీలో రహస్య కొట్లాటలు జరుగుతుంటే, బీజేపీ, బీఆర్ఎస్‌లలో మాత్రం విభేదాలు బహిరంగమవుతుండటం మరో విశేషం. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతోంది. ఏడాదిన్నరలోనే ప్రభుత్వ పాలన, ప్రభుత్వ.. పార్టీ పదవులు, ప్రాధాన్యత, మంత్రివర్గ విస్తరణ, మంత్రుల వ్యవహారశైలి తదితర అంశాలు చర్చనీయాంశమవుతున్నాయి. అంతర్గత విభేదాలకు, ఫిర్యాదులకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణ అంశం ఏడాదిన్నర తర్వాత కూడా కొలిక్కి రావడం లేదు. ఎన్నిసార్లు ఢిల్లీ చుట్టూ తిరిగినా, హైదరాబాద్‌లో చర్చలు జరిగినా తేలడం లేదు. అదిగో విస్తరణ...ఇదిగో విస్తరణ అంటూ ఎప్పటికప్పుడు దాటవేతతో విసుగు వచ్చిన ఇద్దరు

- మిగతా3లో

రక్షణ ఇవ్వండి.. నిజాలు బయటపెడతా..

- ఫోన్ ట్యాపింగ్‌పై నందకుమార్
- 2022 ఎమ్మెల్యేల కొనుగోలు కేసులు నందకుమార్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే.
- ప్రభాకర్ రావు వచ్చినా కూడా న్యాయం జరగదు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆర్జెడీ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది
- ఫోన్ ట్యాపింగ్ కేస్ ఎప్పుడో అయిపోయింది.

హైదరాబాద్

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌పై ఎమ్మెల్యేల కొనుగోలు కేసు నిందితుడు నంద కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 2022 ఎమ్మెల్యేల కొనుగోలు కేసులు నందకుమార్ నిందితుడిగా ఉన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన ఫోన్ కూడా ట్యాప్ అయ్యిందని.. ఈ విషయంపై అప్పటి డీజీపీ రవి గుప్తాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని కలుద్దామని అనుకున్నానని.. కానీ అపాయింట్‌మెంట్ దొరకలేదని అన్నారు. ఈరోజు (బుధవారం) ఏబీఎన్ - ఆంధ్రజ్యోతితో నందకుమార్ మాట్లాడుతూ.. అప్పటి ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్ రావు

- మిగతా3లో

కుల గణనపై కేంద్రం కీలక నిర్ణయం

- తదుపరి దేశ జనాభా గణన 2027, మార్చి ఒకటి నుంచి ప్రారంభం
- 2026 అక్టోబర్ నుంచే లడఖ్, జమ్మూకశ్మీర్ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాలలో ప్రారంభం
- జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్న ప్రభుత్వం
- దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు, మహిళల గణాంకాలతో పాటు, వారి కులం, ఉపకులాలపై ప్రభుత్వం సమాచారం సేకరణ

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద విషాదం

- తొక్కిసలాటలో 10మంది మృతి
- 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే.

రిజర్వేషన్ల తరువాతే ఎన్నికలు

- స్థానిక సంస్థల రిజర్వేషన్లను 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలి
- రాజకీయ పార్టీలు - ప్రతి పక్షాలు బి.సి.లకు మద్దతు ఇవ్వాలి.
- ఉద్యమాలకు సిద్దంగా యుండండి- కుల సంఘాలు పిలుపు
- ముఖ్యమంత్రి లేఖ రాసిన 14 కుల సంఘాలు

హైదరాబాద్

స్థానిక సంస్థలలో బి.సి రిజర్వేషన్లను 42 శాతంకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేయాలని లేకపోతే పెద్ద యెత్తున ఆందోళన చేస్తామని ఊరు వాడ లో ఉద్యమం చేస్తామని రాజ్యసభ్యులు, జాతీయ బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఒక వేళ పెంచకపోతే గ్రామ స్థాయి నుంచి ఉద్యమాలకు సిద్దంగా యుండాలని బి.సి ప్రజలకు పిలుపు నిచ్చారు. 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు జరపాలని ఈ రోజు విద్యానగర్ బి.సి భవన్ లో 14 బి.సి సంఘాలు సమావేశమై ముఖ్యమంత్రికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు.వాస్తవంగా దాదాపు 12 నెలల క్రితం జరగవలసిన ఎన్నికలు బీసీ రిజర్వేషన్ గురించి వాయిదా మీద వాయిదా పడుతూ జాప్యం జరుగుతుంది. ప్రస్తుతం బీసీ రిజర్వేషన్ల విషయం పూర్తిగా పరిష్కారం కాలేదు. ఇది పరిష్కారం కాకుండా పెంచకుండా ఎన్నికలకు ఎలా వెళ్ళడం న్యాయం కాదు. ప్రతి పక్ష పార్టీలు బి.సి రిజర్వేషన్ల విషయంలో తమ వైఖరి ప్రకటించాలని కోరారు.బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతం అసెంబ్లీలో చట్టం చేశారు. కానీ దీని ప్రకారం ఇంతవరకు ప్రభుత్వ జిఓ జారీ కాలేదు. అసెంబ్లీ చట్టం చేసిన తర్వాత కేంద్రముకు పంపుతామని ప్రకటనలు వెలువడ్డాయి

- మిగతా3లో

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- మంత్రి పొంగులేటి కీలక ప్రకటన
- వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం
- తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయి
- ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటుంది
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నాం

ఖమ్మం

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులందరికీ న్యాయం చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మొదటి విడతలో భాగంగా అందజేస్తున్నామని ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్లను ఇస్తున్న తమ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేతలు

- మిగతా3లో

అమెరికా వర్సెస్ చైనా

మిక్కీ, మౌస్ లలో నేతల వ్యవహారం

న్యూఢిల్లీ : చైనా ఆర్థిక, సాంకేతిక వ్యూహాలు అమెరికా ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి ఉద్దేశించినవి. దక్షిణ చైనా సముద్రం, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ వంటి చర్యలు ఈ లక్ష్యంలో భాగం. అయితే, అమెరికా ఆంక్షలు, ఇండో?పసిఫిక్ ఒప్పందాలు చైనాకు సవాళ్లుగా నిలిచాయి. చైనా ఆఫ్రికాలో వాణిజ్య ఆధిపత్యం సాధించినప్పటికీ, పూర్తి విజయం సాధించలేకపోయింది, త్రిశంకు స్వర్గంలా మధ్యలో నిలిచిపోయింది. బ్రిక్స్ దేశాలు డాలర్ ఆధిపత్యాన్ని తగ్గించేందుకు కొత్త కరెన్సీ లేదా చెల్లింపు విధానం కోసం చర్చించాయి. 2024లో రష్యా 'ది యూనిట్' అనే బంగారం ఆధారిత కరెన్సీని ప్రదర్శించినప్పటికీ, ఇది అమలులోకి రాలేదు. చైనా?ఇండియా విభేదాలు, ఏకీకృత బ్యాంకు లేకపోవడం వంటి సమస్యలు ఈ ప్రయత్నాన్ని అసాధ్యం చేశాయి. డాలర్ ఇప్పటికీ 58% గ్లోబల్ రిజర్వ్‌లలో ఆధిపత్యం చెలాయిస్తోంది.చైనా దక్షిణ చైనా సముద్రంలో 2016లో ఖఅం తీర్పును తిరస్కరించడం ద్వారా అం తర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘించిందని విమర్శలు ఎదుర్కొంది. ఈ తీర్పు చైనా చర్యలను నియంత్రించలేకపోయింది, ఇది చైనా యొక్క 'సినోసెంట్రిక్' లక్ష్యాలను కొనసాగించేలా చేసింది. ఈ వైఫల్యం చైనా అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను సూచిస్తుంది.చైనా యొక్క భౌగోళిక రాజకీయ లక్ష్యాలు అమెరికాతో పోటీ, బ్రిక్స్ కరెన్సీ, చట్టపరమైన సవాళ్లు పాక్షిక విజయాలు, పాక్షిక వైఫల్యాలతో త్రిశంకు స్వర్గంలా నిలిచిపోయాయి.

ఇండో పసిఫిక్‌లో చైనా దూకుడు..

తైవాన్‌ను చైనా తన భూభాగంలో భాగంగా పరిగణిస్తుంది. అయితే తైవాన్ తనను స్వతంత్ర దేశంగా చూస్తోంది. ఈ అంశం దశాబ్దాలుగా చైనా?తైవాన్ మధ్య, అలాగే చైనా?అమెరికా మధ్య ఉద్రిక్తతలకు కారణమైంది. పీట్ హెగ్సెత్ తన ప్రసంగంలో చైనా తైవాన్ చుట్టూ సముద్ర జలాల్లో యుద్ధ విమాన వాహక నౌకలను మోహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఇటీవలి సంవత్సరాల్లో, చైనా తైవాన్ సమీపంలో సైనిక విన్యాసాలు, యుద్ధ విమానాల రాకపోకలను పెంచింది. ఇది ఈ ప్రాంతంలో భద్రతా ఆందోళనలను పెంచింది. ఉదాహరణకు, 2024లో చైనా తైవాన్ సమీపంలో రికార్డు స్థాయిలో సైనిక విన్యాసాలు నిర్వహించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, తైవాన్ అంశం చైనా అంతర్గత వ్యవహారమని, ఇందులో విదేశీ దేశాల జోక్యం అనవసరమని స్పష్టం చేశారు. ఈ స్పందన చైనా "ఒకే చైనా" విధానాన్ని గట్టిగా నొక్కి చెబుతుంది, ఇది తైవాన్‌ను తమ భూభాగంగా చూసే వైఖరిని ప్రతిబింబిస్తుంది.ఇండో?పసిఫిక్ ప్రాంతంలో చైనా దూకుడు కేవలం తైవాన్‌కే పరిమితం కాదు. దక్షిణ చైనా సముద్రంలో చైనా ఏకపక్ష చర్యలు, ద్వీపాల నిర్మాణం, సైనికీకరణ వంటివి ఫిలిప్పీన్స్, వియత్నాం, మలేషియా వంటి దేశాలతో వివాదాలకు దారితీశాయి. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ భౌగోళిక వివాదాలను ప్రస్తావిస్తూ, చైనా ఈ ప్రాంతంలో ఆధిపత్యం కోసం ప్రయత్నిస్తోందని విమర్శించారు. చైనా యొక్క "బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్" (ఃఖీఎ) ద్వారా ఆర్థిక, వాణిజ్య ఒత్తిళ్లను కూడా ఈ ప్రాంతంలోని దేశాలపై చైనా చేస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనంగా, హెగ్సెత్ పనామా కాలువపై చైనా ఆధిపత్య ప్రయత్నాలను ప్రస్తావించారు. చైనా లాటిన్ అమెరికాలో తన ప్రభావాన్ని పెంచుకోవడానికి పనామా కాలువను ఒక వ్యూహాత్మక సాధనంగా ఉపయోగించుకోవాలని చూస్తోందని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు చైనా యొక్క ఆర్థిక, సైనిక విస్తరణ వైఖరిని ఎదుర్కోవడానికి అమెరికా తీసుకుంటున్న చర్యలను సూచిస్తాయి.చైనా దూకుడును అడ్డుకోవడానికి అమెరికా ఇండో?పసిఫిక్ ప్రాంతంలో తన సైనిక, ఆర్థిక సామర్థ్యాలను బలోపేతం చేస్తోంది. హెగ్సెత్ తన ప్రసంగంలో ఈ ప్రాంతంలోని మిత్ర దేశాలైన జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, భారతదేశం వంటి దేశాలతో సహకారాన్ని పెంచడం, రక్షణ వ్యయాన్ని పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంలో, ఆసియా?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా నాయకత్వంలో ఏర్పడిన సహకారం మరింత బలపడుతోంది. ఈ కూటమి చైనా యొక్క ఆధిపత్య ధోరణులను అడ్డుకోవడానికి కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక శిక్షణను కొనసాగిస్తోంది, ఇది చైనాకు కోపం తెప్పిస్తోంది.చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లిన్ జియాన్, అమెరికా తైవాన్‌కు ఆయుధాల సరఫరా, సైనిక సంబంధాలను నిలిపివేయాలని హెచ్చరించారు. "నిప్పుతో ఆడుకోవద్దు" అనే వ్యాఖ్య చైనా యొక్క గట్టి వైఖరిని, ఈ అంశంలో ఎట్టి రాజీ లేని స్థితిని సూచిస్తుంది. ఈ ఉద్రిక్తతలు భవిష్యత్తులో సైనిక ఘర్షణలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇండో?పసిఫిక్ ప్రాంతంలో అమెరికా?చైనా మధ్య ఈ ఉద్రిక్తతలు కేవలం రాజకీయ, సైనిక సమస్యలకే పరిమితం కాక, ఆర్థిక, వాణిజ్య రంగాలపై కూడా ప్రభావం చూపవచ్చు. చైనా ఆర్థిక ఒత్తిళ్లు, వాణిజ్య ఆంక్షలు ఈ ప్రాంతంలోని దేశాల ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేయవచ్చు. అదే సమయంలో, అమెరికా యొక్క సైనిక బలోపేతం, మిత్ర దేశాలతో సహకారం ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు కీలకం.

4,302కు చేరిన కొవిడ్ కేసులు.. 24 గంటల్లో ఏడుగురు మృతి

న్యూఢిల్లీ: దేశంలో మరోసారి కొవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. కొవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య 4,302కు చేరినట్టు కేంద్ర ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. గత 24 గంటల్లో ఏడుగురు మృతి చెందినట్టు సమాచారం. వీరిలో ముగ్గురు 22-27 ఏళ్ల మధ్యలో ఉన్నారని, వీరిలో శ్వాస సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి సమస్యలు ఉన్నాయని చెబుతున్నారు. మహారాష్ట్రలో 4, తమిళనాడు, ఢిల్లీలో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. కొవిడ్ యాక్టివ్ కేసుల్లో ముందున్న కేరళలో తాజాగా 43 కేసులు వెలుగుచూడటంతో మొత్తం కేసుల సంఖ్య 1,373కు చేరింది. పశ్చిమబెంగాల్‌లో కొత్తగా 60 కేసులు నమోదై 432కు చేరుకున్నాయి. ఢిల్లీలో కొత్తగా 64 కేసులు నమోదై 457కు చేరింది. గత కరోనా మహమ్మారి సమయంలో తీవ్ర ప్రభావం కనిపించిన మహారాష్ట్రలో కొత్తగా 16 యాక్టివ్ కేసులు నమోదు కావడంతో మొత్తం కేసుల సంఖ్య 510కి చేరింది. వ్యాధి లక్షణాలు కనిపించిన వారిలో సబ్‌వేరియంట్స్ ఎల్.7, ఎన్‌బీ.1.8.1లు వేరియంట్లుగా గుర్తించామని, అయితే ఇవి ఆందోళన కలిగించే వేరియంట్లా కాదా అనేది మానిటర్ చేస్తున్నామని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇటీవల తెలిపింది. కాగా, కొత్త సబ్ వేరియంట్లు వెలుగుచూస్తున్నప్పటికీ జేఎన్-1 వేరియంట్ ఎక్కువ మందిలో కనిపిస్తోందని, 53 శాతం పాజిటివ్ కేసుల్లో ఈ వేరియంట్ కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. ఏప్రిల్‌లో తమిళనాడులో ఎన్‌బీ.1.8.1 వేరియంట్ కనిపించగా, ఈ నెల ప్రారంభంలో గుజరాత్‌లో నాలుగు కేసుల్లో ఎల్‌ఎఫ్.7 ఉన్నట్టు గుర్తించారు. ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని, శ్వాససంబంధిత ఇబ్బందులు, గొంతు సమస్యలు, జీర్ణాశయంలో ఇబ్బందులు ఉంటే సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్స్ నిర్వహించాలని రాష్ట్రాలకు కేంద్ర సూచనలిస్తోంది.

పాక్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంక్ రుణసాయం

పాకిస్థాన్‌కు ఆసియా అభివృద్ధి బ్యాంక్ 800 మిలియన్ డాలర్ల రుణం మంజూరు చేయడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. పాక్ సైనిక వ్యయం కోసం నిధులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. జూన్ 3న ఈ ప్యాకేజీకి ఆమోదం లభించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' తో గట్టిగా బదులు తీర్చుకుంది. ఆ నేపథ్యంలో రెండుదేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. తరుణంలో పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది. పాక్‌కు నిధులు మంజూరు చేస్తే పరోక్షంగా ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినట్లే అవుతుందని.. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఐఎంఎఫ్ పాక్‌కు నిధులు సమకూర్చడంపై పునరాలోచించాలని భారత ప్రభుత్వం కోరిన సంగతి తెలిసిందే.

బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద విషాదం

బెంగళూరు: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా పెను విషాదం చోటు చేసుకుంది. 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించుతూ ఆర్సీబీ.. ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఆర్సీబీ జట్టుకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో స్టేడియం వద్దకు వేలాదిగా అభిమానులు తరలివచ్చారు. స్టేడియం గేట్లు, సమీపంలోని గోడలు, చెట్లు ఎక్కారు. గేట్-2 నుంచి స్టేడియంలోకి వెళ్లేందుకు ఒక్కసారిగా దూసుకెళ్లారు. అభిమానులను అదుపు చేసేందుకు పోలీసులు లాఠీఛార్జి చేయాల్సి వచ్చింది. దీంతో ఒక్కసారిగా తోపులాట జరిగింది. ఈ ఘటనలో 10 మంది మృతి చెందగా, 50 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఆరుగురు పురుషులు, నలుగురు మహిళలు ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్.. ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించారు. తొక్కిసలాట ఘటనతో ఆర్సీబీ క్రీడాకారులకు సన్మాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. చిన్నస్వామి స్టేడియంవైపు వెళ్లే మెట్రో, ఇతర వాహనాలను నిలిపివేశారు.

బెంగళూరు విమానాశ్రయంలో ఘనస్వాగతం..

ఎన్నో పరాభవాల తర్వాత ఆర్సీబీ కల నెరవేరడంతో దేశవ్యాప్తంగా బెంగళూరు టీమ్ అభిమానులు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకుంటున్నారు. ఆర్సీబీ టీమ్ ట్రోఫీతో తొలిసారి బెంగళూరుకు రాగా.. ఫ్యాన్స్ ఘన స్వాగతం పలికారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ విమానాశ్రయానికి వెళ్లి ఆర్సీబీ జట్టుకు స్వాగతం పలికారు. విరాట్ కోహ్లీ, కృనాల్ పాండ్య, టిమ్ డేవిడ్, దినేశ్ కార్తిక్‌లకు ఆయన పుష్పగుచ్ఛం అందించి వెల్‌కమ్ చెప్పారు. అనంతరం బెంగళూరు జట్టు ప్రత్యేక బస్సులో విధాన సౌధకు చేరుకుంది. ఈ క్రమంలో వేలాది అభిమానులు ఆర్సీబీ జెండాలు చేతబూని విధాన సౌధ వద్దకు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా 'ఎర్రసముద్రాన్ని' తలపించింది. ఆర్సీబీ ఆటగాళ్లు బస్సులో వస్తున్న మార్గంలోనూ అభిమానులు సందడి చేశారు.

కుల గణనపై కేంద్రం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ: జనాభా లెక్కలకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ లెక్కలు దేశాభివృద్ధికి పలు విధాలుగా దోహదపడనున్నాయి. తదుపరి దేశ జనాభా గణన 2027, మార్చి ఒకటి నుంచి ప్రారంభం కానున్నదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దీనిలో కుల గణనతో పాటు కీలకమైన సామాజిక, ఆర్థిక వివరాలను సేకరించనున్నారు. ఈ జనాభా గణన 2026 అక్టోబర్ నుంచే లడఖ్, జమ్ముకశ్మీర్ హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ తదితర ప్రాంతాలలో ప్రారంభం కానుంది. జనగణనను రెండు దశల్లో నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పురుషులు, మహిళల గణాంకాలతో పాటు, వారి కులం, ఉపకులాలపై ప్రభుత్వం సమాచారం సేకరించనుంది. కులాల వారీగా జనాభా గణన చేయడం వలన ఎవరెవరికి వాస్తవంగా సరైన అవకాశాలు లభిస్తున్నాయో, ఎవరు ఇంకా వెనుకబడి ఉన్నారో లాంటి విషయాలు వెల్లడి కానున్నాయి. విద్య, ఉపాధి, ఆరోగ్యం, ప్రభుత్వ సహాయాలు తదితర అంశాల్లో సమానత్వాన్ని తీసుకొచ్చేందుకు ఇది ఎంతో కీలకంగా మారనుంది. దీని ఆధారంగానే ప్రభుత్వం విధానాలను రూపొందించాల్సి ఉంటుంది. కుల గణనకు పలు రాజకీయ పార్టీలు మద్దతునిస్తున్నాయి. దేశంలో చివరిసారి అధికారికంగా కులాల వారీగా జనాభా గణన 1931లో చేపట్టారు. ఆ తర్వాత 1941లో మళ్లీ చేయాలనుకున్నా, రెండో ప్రపంచ యుద్ధం కారణంగా కుల గణన నిర్వహించలేకపోయారు. దీంతో నాటి గణనలే ఇప్పటికీ రిఫరెన్స్ పాయింట్‌గా కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ హయాంలో 2011లో కుల గణన జరిగింది. అయితే ఇది పూర్తి వివరాలతో బయటకు రాలేదు. 1948 జనాభా చట్టం ప్రకారం వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచాలి. ఈ కారణంగానే నాటి గణాంకాలపై స్పష్టత రాలేదు.

జులై 21 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు



న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తేదీలు ఖరారయ్యాయి. జులై 21వ తేదీ నుంచి ఆగష్టు 12వ తేదీ దాకా సెషన్ ఉంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెన్ రిజిజు బుధవారం ప్రకటించారు. ఆపరేషన్ సింధూర్ నేపథ్యంతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఇండియా కూటమి డిమాండ్ చేస్తున్న వేళ.. వర్షాకాల సమావేశాల తేదీలను కేంద్రం ప్రకటించడం గమనార్హం. ఈ ఏడాది పార్లమెంట్ తొలి సమావేశం.. జనవరి 31వ తేదీన బడ్జెట్ సెషన్‌తో ప్రారంభమైంది. కాస్త విరామంతో రెండు దఫాలుగా బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఏప్రిల్ 4వ తేదీన లోక్‌సభ, రాజ్యసభల నిరవధిక వాయిదాతో ఈ ఏడాది పార్లమెంట్‌కు తొలి సమావేశాలు(బడ్జెట్) జరిగాయి.

కుప్పకూలిన మూడంతస్తుల భవనం

న్యూఢిల్లీ, జూన్ 04: దేశ రాజధాని న్యూఢిల్లీలోని రోహిణి సెక్టర్ 7లో మూడంతస్తుల భవనం బుధవారం కుప్పకూలింది. ఈ ఘటనలో పలువురు వ్యక్తులు భవనం కింద శిథిలాల్లో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. దీనిపై సమాచారం అందగానే ఎన్డీఆర్ఎఫ్, పోలీసులు, నగర పాలక సంస్థ సిబ్బంది హుటిహుటిన ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ సహాయక చర్యలు కొనసాగుతోన్నాయి. ఈ భవనం కుప్పకూలిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ ఘటనపై సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ పరాస్ మాట్లాడుతూ.. శిథిలాల కింద చాలా మంది చిక్కుకుని ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ రోజు సాయంత్రం 4.00 గంటలకు అగ్నిమాపక సిబ్బందికి ఈ భవనం కూలినట్లు సమాచారం అందిందని.. దీంతో వారంతా ఘటన స్థలానికి కొన్ని నిమిషాల వ్యవధిలోనే చేరుకున్నారని ఉన్నతాధికారులు వివరించారు.

రాజకీయల్లో రగడ!

-మొదటిపేజీ తరువాయి

ఆశావహ ఎమ్మెల్యేలు.. కేబినెట్‌లో బెర్తు కేటాయించకపోతే తమ దారి తాము చూసుకుంటామని సన్నిహితుల వద్ద నిరసన గళం విన్పించినట్టుగా బయటకు రావడం పార్టీలో కలకలం రేపింది. మరోవైపు పదవుల లొల్లి కూడా ఆ పార్టీని కుదిపేస్తోంది. చాలా కాలం తర్వాత నియమించిన కమిటీల్లో కొంత సామాజిక న్యాయ కోణం కనిపించినా సీనియర్లు, జూనియర్లు అనే విభేదాలు మరింత పెరిగాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జూనియర్లకు, ప్యారాచూట్ల (బయటి పార్టీల నుంచి వచ్చిన వారికి)కు కమిటీల్లో ప్రాధాన్యతనిచ్చారనే అసంతృప్తి వ్యక్తమవుతుండటం గమనార్హం. ఇంకోవైపు మహిళా కాంగ్రెస్ నేతలు గాంధీభవన్‌లోని టీపీసీసీ అధ్యక్షుడి చాంబర్ ముందు తమకు ప్రాధాన్యత లభించడం లేదంటూ ధర్నాకు దిగడం కూడా చర్చనీయాంశమైంది. అయితే, టీ కప్పులో తుపాను మాదిరి ఆ వివాదం ముగిసినా, పార్టీలో ప్రాధాన్యత అంశం అంతర్గతంగా అగ్గిని రాజేస్తూనే ఉంది.

మంత్రులపై ఫిర్యాదులు..పాలనపై విమర్శలు

సీఎంకు, మంత్రులకు మధ్య సఖ్యత లేదనే అభిప్రాయం వ్యక్తమవుతుండగా, కొందరు మంత్రుల పనితీరుపై ఎమ్మెల్యేలు ఫిర్యాదులు చేసేంతవరకు పరిస్థితి వెళ్లిపోయింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై కూడా పార్టీలో తీవ్రంగానే చర్చ జరుగుతోంది. ఎంత చేసినా ప్రజల మన్ననలు రావడం లేదని పార్టీ నేతలు చెబుతుంటే, తాము చేసినవన్నీ పార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లడం లేదనే అభిప్రాయంతో ప్రభుత్వ పెద్దలున్నారు. ఈ క్రమంలో వీలున్నంత త్వరగా మంత్రివర్గ విస్తరణ జరగాల్సిందేనని, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించి పట్టు నిరూపించుకోకపోతే పార్టీ గ్రాఫ్ డౌన్ కావడం ప్రారంభమవుతుందని కాంగ్రెస్ నేతలే బహిరంగ వ్యాఖ్యలు చేస్తుండడం గమనార్హం.

గులాబీకి 'కుటుంబ ముళ్ల' పోటు

బీఆర్ఎస్‌లో ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత వ్యవహారం ప్రకంపనలు సృష్టిస్తోంది. పార్టీలో ఆమె ఇప్పుడు రె'బెల్స్' మోగిస్తున్నారు. తండ్రి కేసీఆర్‌ను విమర్శించకుండా వ్యూహాత్మక వ్యాఖ్యలు చేస్తూ, ప్రశ్నలు వేస్తూ గులాబీ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిపోయారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వాస్తవానికి వరంగల్‌లో పార్టీ రజతోత్సవ సభకు ముందు అంతర్గత చర్చలకే పరిమితమైన ఆమె, ఆ తర్వాత గేర్ మార్చారు. సభ నిర్వహణ గురించి కేసీఆర్‌కు స్వదస్తూరితో రాసిన లేఖ బీఆర్ఎస్‌లో అశాంతిని బహిర్గతం చేసింది. ఆ లేఖ లీక్ కావడం, ఆ లీకేజీ వెనుక ఎవరున్నారన్న దానిపై చర్చోప చర్చలు జరుగుతుండడం అటు బీఆర్ఎస్‌నే కాదు, ఇటు రాష్ట్ర రాజకీయ వర్గాలను కూడా కుదిపేశాయి. కేసీఆర్ దేవుడని, అయితే ఆయన చుట్టూ దెయ్యాలున్నాయంటూ కవిత చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారాన్నే రేపాయి. అమెరికా నుంచి వచ్చిన వెంటనే శంషాబాద్ విమానాశ్రయంలోనే ఆమె పేల్చిన బాంబు మంటలు ఇంకా చల్లారలేదు. ఆ తర్వాత ఆమె స్పీడ్ మరింత పెంచారు.

ఇష్టాగోష్టిలో బాంబు పేల్చిన కవిత

మీడియాతో ఇష్టాగోష్టి పేరుతో కవిత మరో రాజకీయ ఆటం బాంబు పేల్చారు. బీజేపీతో పొత్తు కుదుర్చుకునేందుకు బీఆర్ఎస్‌లో ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని అడ్డుకుంటున్నందుకే తనను బయటకు పంపాలని చూస్తున్నారంటూ కవిత చేసిన వ్యాఖ్యలు అధినేత కేసీఆర్‌ను సైతం ఇరకాటంలో పడేశాయి. అంతటితో ఆగని కవిత తెలంగాణ జాగృతి పేరుతో బలోపేతం అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్‌తో సమాంతరంగా జాగృతిని తీసుకెళ్తానని చెప్పకనే చెపుతున్న ఆమె, పరోక్షంగా పార్టీని సవాల్ చేస్తూ ధర్నాకు దిగుతున్నారు. కేసీఆర్‌కు కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులు ఇవ్వడానికి నిరసనగా చేపడుతున్న ధర్నాతో.. బీఆర్ఎస్ చేయలేని పనిని తాను చేస్తున్నానని పార్టీ కేడర్‌కు సంకేతాలిచ్చే ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఈ కుటుంబ పంచాయతీ కేడర్‌ను అయోమయానికి గురి చేస్తోంది. ఇలావుండగా.. ఎప్పుడూ లేని విధంగా ఇటీవల హరీశ్‌రావు ఇంటికి కేటీఆర్ వెళ్లడం కూడా అటు బీఆర్ఎస్‌లోనూ, ఇటు రాజకీయ వర్గాల్లోనూ చర్చకు దారి తీస్తోంది. ఇంత జరుగుతున్నా.. కేటీఆర్ నాయకత్వాన్ని ప్రశ్నించే రీతిలో కవిత అస్త్రాలు సంధిస్తున్నా కేసీఆర్ మాత్రం మౌన ముద్రలోనే ఉండడం గమనార్హం.

కమలం.. కలహాల కాపురం

సాధారణంగా బీజేపీలో అంతర్గత విభేదాలు బహిర్గతం కావు. ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ భావజాలంతో నడిచే ఆ పార్టీలో ఎంతటి వివాదాలు, భిన్నాభిప్రాయాలైనా లోలోపలే పరిష్కరించుకుంటారు. కానీ తెలంగాణ బీజేపీలో మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గ్రూపులుగా విడిపోయి వ్యవహరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదని, ఎంపీల్లోని ఏ ఇద్దరూ ఒక్కచోట కూర్చుని మాట్లాడుకునే పరిస్థితి లేదని ఆ పార్టీ వర్గాలే వ్యాఖ్యానిస్తున్నాయి. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక విషయంలో పెద్ద రచ్చే నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతగా అంటే అసలు ఏ నాయకుడిని ఎంపిక చేయాలో పార్టీ అధిష్టానానికి కూడా అంతుపట్టనంతగా ఈ పదవి కోసం నేతలు పోట్లాడుకుంటున్నట్టు బీజేపీలో జరుగుతున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఏడాది తర్వాత కూడా కిషన్‌రెడ్డినే రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారంటే ఆ పార్టీలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. జిల్లా పార్టీ అధ్యక్షుల ఎంపిక వ్యవహారంలోనూ బహిరంగ విమర్శలు వ్యక్తమయ్యాయి.

రాజాసింగ్ టార్గెట్ ఎవరో?

రాష్ట్ర బీజేపీలో కీలక నేతగా, ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రచ్చ రచ్చ చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ముందు పార్టీ నుంచి సస్పెండ్ అయ్యి, ఆ తర్వాత మళ్లీ పార్టీలోకి వచ్చి కమలం గుర్తుపైనే ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. అయితే, ఈసారి ఎన్నికల్లో గెలిచిన తర్వాత రాజాసింగ్ స్టైల్ మార్చారు. ఎప్పటిలాగా ఎంఐఎంను కాకుండా ఈసారి సొంత పార్టీ నేతలనే టార్గెట్ చేస్తూ వస్తున్నారు. తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో పెద్ద చర్చకే దారి తీస్తున్నాయి. 'మా పార్టీ నేతలకు ప్యాకేజీలు ఇస్తే ఏ పార్టీనయినా విలీనం చేసుకుంటారు..' అంటూ ఆయన వ్యాఖ్యానించడం తీవ్ర దుమారాన్ని రేపింది. ఆయన్ను మరోమారు సస్పెండ్ చేస్తారనేంత వరకు ఈ వ్యవహారం వెళ్లింది. అయితే ఆ అంశంపైనా ఆయన తీవ్రంగా స్పందించారు. తనను సస్పెండ్ చేస్తే ఒక్కొక్కరి జాతకాలు బయట పెడతానంటూ హెచ్చరించడం పార్టీ నేతలను ఇరకాటంలో పెట్టింది. ఈ నేపథ్యంలో ఆయన అసలు రాష్ట్ర పార్టీలో ఎవరిని టార్గెట్ చేశారన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రాష్ట్ర శాఖ అధ్యక్షుడి ఎంపిక, పార్టీ ఎమ్మెల్యే చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యల విషయంలో.. అధిష్టానం పట్టీపట్టనట్టుగా ఉండటం, ఎలాంటి జోక్యం చేసుకోకపోవడం పార్టీ వర్గాల్లో హాట్‌టాపిక్ అవుతోంది. ఈ విధంగా.. ఎన్నికలకు మూడేళ్లకు పైగా సమయం ఉన్నప్పుడే ఈ మూడు ప్రధాన పార్టీల్లో జరుగుతున్న లొల్లి, అసెంబ్లీ ఎన్నికల నాటికి ఎంత తీవ్రంగా మారుతుందోనన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది.

గ్రేటర్ రేషన్ కార్డుల దందా

హైదరాబాద్ : రేషన్ కార్డుల కోసం ఇప్పుడు ప్రజలు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. ఇదే అదునుగా భావించిన పౌరసరఫరాల అధికారులు డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పాలనలో 30 శాతం కమీషన్లు ఇస్తేనే పనులు చేస్తున్నారంటూ పలువురు రాష్ట్ర మంత్రులపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మేమేం తక్కువ తిన్నామా అంటూ కొందరు అధికారులు సైతం వారిని ఆదర్శంగా తీసుకొని అవినీతి దందాకు తెరలేపారు. ప్రతి రోజూ అందినకాడికి దండుకుంటున్నారు. రెండు మూడు రోజుల్లోనే కొత్త రేషన్ కార్డులు ఇప్పిస్తామని కొందరు సివిల్ సప్లై ఉద్యోగులతో పాటు పలువురు దళారులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే అరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా కావాల్సింది ప్రధానంగా రేషన్ కార్డు. ప్రతి పేద, నిరు పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డు అనేది అవసరం. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు ఇవ్వాలనే ఉద్దేశంతో మీసేవ సెంటర్ల ఆన్‌లైన్ చేసుకొని పౌరసరఫరాల కార్యాలయాల్లో వాటిని వెరిఫికేషన్ చేసి వెంటనే కార్డు మంజూరు చేయాలని ప్రభుత్వం చెబుతుంటే దీనికి భిన్నంగా పౌరసరఫరాల అధికారులు వ్యవహరిస్తున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం గత ఏడాది నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తులు స్వీకరించారు. వాటి విచారణను మాత్రం పౌరసరఫరాల అధికారులు జీహెచ్ఎంసీకి అప్పగించించారు. కొత్తగా కార్డు కావాలనుకునే వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకునే అవసరం లేదంటూ అప్పట్లో అధికారులు ప్రకటించారు. అయితే రెండు శాఖల అధికారుల సమన్వయ లోపంతో తీరా ప్రజా పాలన దరఖాస్తులను పక్కన పెట్టి జీహెచ్ఎంసీ అధికారులు చేతులెత్తేశారు. దీంతో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు కూడా తాజాగా మరో సారి మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు ప్రకటించారు. దీంతో గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న కుటుంబాలతో పాటు కొత్తగా రేషన్ కార్డు కావాలనుకునే వారు, కార్డులో మార్పులు చేర్పులు చేసుకునే వారు మీ సేవా కేంద్రాలకు క్యూ కడుతున్నారు. అయితే వీరిది అవసరం..ఇదే మనకు అవకాశంగా భావించిన కొంత మంది పౌరసరఫరాల అధికారులు కొందరు దళారుల అండతో అక్రమంగా డబ్బుల వసూళ్లకు పాల్పడుతూ భారీ అవినీతికి తెరలేపారని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.కొత్త రేషన్ కార్డుల మంజూరులో ఏరియా సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్లు కీలకంగా మారారు. దీంతో అంబర్ పేట సర్కిల్ పరిధిలోని అంబర్ పేట డివిజన్ పరిధిలోకి వచ్చే 2 ?3 ఇంటి నంబర్లకు సంబంధించిన విచారణ అధికారిగా విధులు నిర్వహిస్తోన్న ఓ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపణలు ఉన్నాయి. సదరు అధికారి కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న కుటుంబాల ఇంటి వెళ్లి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి అసలైన అర్హులను గుర్తించి వారికి కొత్త రేషకార్డులను మంజూరు చేయాల్సి ఉంటుంది?కానీ అతను అంబర్ పేట పటేల్ నగర్ హనుమాండ్ల గుడి వద్ద ఓ వారం రోజుల పాటు క్యాంపు ఏర్పాటు చేసుకొని తూతూ మంత్రంగా విచారణ చేపట్టి వదిలేశాడని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి విచారణ పేరుతో వెళ్లి ఏదో కారణం చూపిస్తూ మీకు కార్డు రాదంటూ బయపెడుతున్నారని దీంతో చేసేది ఏమీ లేక రూ.వెయ్యి లంచం ఇచ్చుకోక తప్పడం లేదని పలువురు పేరు తెలపడానికి ఇష్ట పడని అర్హులైన పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లంచం ఇచ్చే వారి పట్ల ప్రేమగా ఉంటూ .. నెలలు గడిచినా ఇంకా కొత్త కార్డు రాలేదని అర్హులైన దరఖాస్తు చేసుకున్న సామాన్య ప్రజలు సర్కిల్ కార్యాలయం వద్దకు వెళితే బెదిరింపులకు పాల్పడుతూ సరైన సమాధానం చెప్పకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పాలనలో ఇది కామనే ?అంటూ ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.ఈ అక్రమ దందాలో పలు పార్టీల నాయకులతో పాటు తాడు, బొంగరం, ఊరు పేరు లేని పొట్ట చీల్చితే అక్షరం రాని కొందరు విలేకరులు కూడా దళారులుగా మారి అందిన కాడికి దండుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డు వెంటనే ఇప్పిస్తామంటూ సదరు దళారులు మీ సేవా కేంద్రాల్లో నమోదు చేసిన దరఖాస్తులను లబ్ధిదారుల వద్ద తీసుకుని వారి వద్ద రూ.2వేల వరకు వసూళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. వీరు అంబర్ పేట డివిజన్ సివిల్ సప్లై ఇన్ స్పెక్టర్ తో కుమ్మక్కై ఓ ఒప్పందం కుదర్చుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. లబ్ధిదారుల వద్ద తీసుకున్న డబ్బుల్లో రూ.వెయ్యి ఇన్ స్పెక్టర్ కు లంచంగా ఇవ్వడంతో అదే రోజు అనర్హులైనా ఎలాంటి విచారణ చేయకుండా వాటిని క్లియరెన్స్ చేస్తున్నట్లు ఆరోపణలు సైతం ఉన్నాయి. దీంతో వారికి కేవలం రెండు రోజుల్లోనే కొత్త కార్డులు మంజూరు అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కొంతమంది నెలలు గడిచినా రేషన్ కార్డు మంజూరు కాకపోవడంతో తమకు కార్డు వస్తుందో ..రాదో అంటూ ఆందోళన చెందుతున్నారు. డబ్బులు తీసుకొని రేషన్ కార్డులు మంజూరు చేసే అధికారుల పైన ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని రేషన్ కార్డు లబ్ధిదారులు కోరుతున్నారు

కరీంనగర్ లో డివిజన్ల నోటిఫికేషన్

కరీంనగర్ : మున్సిపల్ ఎన్నికలకు త్వరలోనే నగరా మోగనున్న నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో విలీన గ్రామాలకు సంబంధించి డివిజన్లు, వార్డుల పునర్విభజనకు రాష్ట్ర సర్కారు సోమవారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మేరకు ఈ నెల 3న డివిజన్ల విభజనకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సి ఉంటుంది 5 నుంచి 11 వరకు అభ్యంతరాలు, నివేదికలు స్వీకరించాలి. 12 నుంచి 16 వరకు అభ్యంతరాలను పరిశీలించాల్సి ఉంటుంది. 17, 18 తేదీల్లో డివిజన్ల విభజన పత్రాలకు కలెక్టర్ అనుమతి తీసుకోవాలి. 19న ముసాయిదా జాబితాను సీడీఎంఎకు పంపించాలి. 20న సీడీఎంఏ నుంచి ప్రభుత్వానికి నివేదికను పంపించి, 21న ఫైనల్ డివిజన్ల జాబితాను విడుదల చేస్తారు.కరీం'నగరం' సమీపంలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు మల్కాపూర్, చింతకుంట, గోపాల్‌పూర్, దుర్శేడ్, బొమ్మకల్ గ్రామాలను కలుపుతూ ప్రస్తుతం ఉన్న 60 డివిజన్లను 66కు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు నగరపాలక అధికారులు 66 డివిజన్లకు సంబంధించి గతంలోని ఓటరు జాబితాను అనుసరించి డివిజన్ల విభజనను పూర్తి చేసి సీడీఎంఏకు పంపినట్లు సమాచారం. అందుకు సంబంధించిన ఒక జాబితా కూడా గతంలోనే సోషల్ మీడియాల్లో చక్కర్లు కొట్టింది. అప్పటి నుంచే కార్పొరేషన్‌లోని వివిధ పార్టీల నాయకుల్లో డివిజన్ల విభజనపై ప్రత్యేక ఆసక్తి నెలకొన్నది.ఎవరికివారే తమ

డివిజన్ల విభజన ఎలా జరిగింది? ఏయే కాలనీల ఓట్లు ఏయే ప్రాంతాల్లో కలిపారన్న చర్చలు సాగాయి. ప్రతి డివిజన్‌కు 4500 నుంచి 5500 ఓటర్లు ఉండేలా అధికారులు డివిజన్లను విభజించినట్లు తెలుస్తుండగా, అయితే పలు డివిజన్లల్లో దూర ప్రాంతాలకు చెందిన ఇండ్లను చేర్చినట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఆయా ప్రాంతాలకు సంబంధించి ఫిర్యాదులు, తమ అభ్యంతరాలు తెలిపేందుకు ఇప్పటికే పలు పార్టీలకు చెందిన నాయకులు సిద్ధమయ్యారు

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-మొదటిపేజీ తరువాయి

తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ప్రభుత్వానికి చిత్తశుద్ధి, పేదవారి పట్ల ప్రేమ అభిమానాలు ఉన్నాయని తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లాలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో గల సత్యనారాయణపురంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. వచ్చే నాలుగు సంవత్సరాల్లో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఉద్ఘాటించారు. పాలేరు నియోజకవర్గంలో ప్రతి ఇంటికి పెద్ద కొడుకుగా ఉండి అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఆడబిడ్డ, తమ్ముడి కళ్లల్లో ఆనందాన్ని చూస్తుంటే భావోద్వేగానికి లోనవుతున్నామని చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే మంచి పనిచేస్తే వారి నుంచి వచ్చే స్పందన గొప్పగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేక పోయినా సన్నబియ్యం ఇస్తున్నామని వెల్లడించారు. పది సంవత్సరాల్లో మాజీ సీఎం కేసీఆర్‌కి రేషన్ కార్డులు కూడా ఇవ్వాలనే ఇంగిత జ్ఞానం లేదని ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో 19 లక్షల మంది పేర్లను కొత్తగా రేషన్ కార్డులో జమచేశామని ప్రకటించారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని గత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పుల్లోకి నెట్టారని పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ధనిక రాష్ట్రంలో రూ.8 లక్షల 19 వేల కోట్ల అప్పు చేసి పోతే.. ప్రతి నెల రూ.6,500 కోట్ల వడ్డీని తమ ప్రభుత్వం కడుతూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల మాదిరిగా పేదోళ్ల గురించి మొసలి కన్నీరుని ఇందిరమ్మ ప్రభుత్వం కార్చబోదని చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని మండిపడ్డారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. ఊకదంపుడు ఉపన్యాసాలు, కాలయాపన చేసే కబుర్లు చెబితే ప్రజలు నమ్మరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబ సభ్యులు కట్టుకున్న ప్యాలెస్‌లు, అధికారులు, ప్రజాప్రతినిధులు నివసించే బంగ్లాల మీద పెట్టిన ఖర్చు, శ్రద్ధ పేదవారి ఇంటి మీద ఎందుకు పెట్టలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో రూపాయి ఖర్చు పెడితే రాజకీయంగా ఏం లాభం వస్తోందనే ఆలోచించారని అన్నారు. పేదవారికి ఖర్చు పేట్టె ప్రతి రూపాయి వారికి అందుతుందా లేదా అని కూడా కేసీఆర్ కనీసం ఆలోచించలేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు.

రక్షణ ఇవ్వండి.. నిజాలు బయటపెడతా..

-మొదటిపేజీ తరువాయి

చెబితేనే తన ఫోన్ టాప్ చేసినట్టు రాధా కిషన్ రావు కన్ఫ్యూషన్ స్టేట్మెంట్‌లో చెప్పారన్నారు. తన ఫోన్ ట్యాప్ చేశారని రాధా కిషన్ రావు స్టేట్‌మెంట్‌తో క్లియర్‌గా తేలిందన్నారు. పక్కా సమాచారం ఉన్నా పోలీసులు ఆధారాల కోసం మూసీలో వెతికారన్నారు. ప్రభాకర్ రావు విచారణ తర్వాత ఎవరికి ఫిర్యాదు చేయాలో వాళ్లకి చేస్తానని.. తన ఫోన్ ట్యాప్ చేయడానికి ఇంటలిజెన్స్ అధికారులు ఎవరి అనుమతి తీసుకున్నారని ప్రశ్నించారు. తన ఫోన్ ట్యాప్ చేయకుండా తనకు సంబంధించిన ఆడియోలు మాజీ సీఎం కేసీఆర్‌కు ఎలా దొరికాయని నిలదీశారు. తాను రోహిత్ రెడ్డి మాట్లాడిన మాటలు కాల్ రికార్డింగ్ కావచ్చని.. కానీ సింహయాజి స్వామితో మాట్లాడిన కాల్స్ కూడా రికార్డింగేనా అని అడిగారు. ఫాం హౌస్ కేసు స్టేట్ సెంట్రల్ ఇష్యూ అని.. అందులో తాను బలైనట్లు తెలిపారు. ప్రభాకర్ రావు వచ్చినా కూడా న్యాయం జరగదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆల్రెడీ మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ కేస్ ఎప్పుడో అయిపోయిందని.. జస్ట్ ఫార్మాలిటీస్ కోసం ప్రభాకర్ రావు ఇండియా వస్తున్నారన్నారు. ఫోన్ ట్యాపింగ్ తానే చేయించాను అని ప్రభాకర్ రావు అంగీకరిస్తే కేసు అక్కడితో ముగుసినట్టే అని అన్నారు. 'నాకు ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులు, మాజీ సీఎం కేసీఆర్ నుంచి ప్రాణహాని ఉంది. నాకు రక్షణ కల్పిస్తే చాలా విషయాలు బయటపెడతా' అని నందకుమార్ పేర్కొన్నారు.

రిజర్వేషన్ల తరువాతే ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి

కానీ ఇంతవరకు దాని అతి-గతి తెలియడం లేదు. వాస్తవంగా రాజ్యాంగ ప్రకారం స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి యుంది. కానీ ముఖ్యమంత్రి కేంద్రంపై నెట్టి తప్పించుకోవడానికి చేస్తున్నారు.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరపడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాల ద్వారా తెలుస్తుంది 42 శాతం కు బిసి రిజర్వేషన్ల పెంచే విషయంలో ఇంతవరకు క్లారిటీ ప్రభుత్వం ఇవ్వడం లేదు. ఒక్కొక్కసారి ఒక రకమైన ప్రచారం చేస్తున్నారు. ఒకసారి 42 శాతం రిజర్వేషన్లు పెంచనున్నట్లు ప్రకటిస్తున్నారు. ఇంకోసారి పార్టీ పరంగా 42 శాతం టికెట్లు ఇస్తామని ప్రకటిస్తున్నారు. ఇలా వివాదాస్పదమైన ప్రకటనలు జారీ చేస్తున్నారు. పార్టీ పరంగా టికెట్లు వద్దు ఆ బిక్షం వద్దు హక్కు కావాలి. "హక్కు యుంటి అన్నీ పార్టీ టికెట్లు ఇస్తారు. పార్టీ పరంగా ఇస్తే అన్యాయం జరుగుతుంది. ఒక్కక్క పార్టీ ఒక చోట ఇస్తే అగ్రా కులాలకు డబ్బుతో బి.సి.లు పోటీ పడలేరు. ముక్తకంఠంతో బీసీలందరూ కోరేది ఒకటే 42 శాతం కు బీసీ రిజర్వేషన్లు పెంచుతూ జీవో జారీ చేయాలి. 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి ప్రభుత్వానికి ఎలాంటి అవరోధాలు లేవు.స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది. 73-74వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు రాజ్యాంగంలోని ఆర్టికల్ 243-ఆ6 ప్రకారం స్థానిక సంస్థలలో బిసి రిజర్వేషన్లు పెంచే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి రాజ్యాంగబద్ధమైన అధికారం ఇచ్చింది. దీని ప్రకారం అసెంబ్లీలో చట్టం చేశారు. దీని ప్రకారం జిఓ తీసి వెంటనే ఎన్నికలు జరపవచ్చు. సుప్రీంకోర్టుకు ఎవరైనా వెళ్ళినా బీసీల కేసు గెలిచే అవకాశం యుంది. ఎందుకంటే జనాభా లెక్కలు ఉన్నవి. అసెంబ్లీలో చట్టం చేశారు. అలాగే సుప్రీంకోర్టు ఇచిా కేసులో 50% సీలింగ్ ఎత్తివేసింది. ఇప్పుడు అన్ని కోణాలలో చూస్తే గెలిచే అవకాశం యుంది చట్టపరమైన, న్యాయపరమైన, రాజ్యాంగపరమైన అవరోదాలు లేవు. కావున సుప్రీం కోర్టులో కేసు గెలుస్తుంది. కావున తమరు జోక్యం చేసుకొని వెంటనే జిఓ తీసి ఎన్నికలు జరుపాలని విజ్ఞప్తి చేస్తున్నాం.ఒక వేళ ఎవరైనా కోర్టుకు వెళితే గట్టిగా వాదిస్తే కేసు గెలుస్తుంది. ఒక వేళ కేసు గెలవకపోతే పార్టీ బాధ్యత లోపాలు ప్రజలు కూడా చూసుకుంటారు. ప్రజా ఉద్యమాల ద్వారా రాడో పేడో బి.సి సంఘాలు చూసుకుంటారు. జి.ఓ తీసి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తున్నాం...ఇక విద్యా, ఉద్యోగాలలో రిజర్వేషన్లు పెంపుకు కచ్చితంగా రాజ్యాంగ సవరణ చేయవలసి ఉంటుంది. తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి కేంద్రానికి పంపి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాలి. ఇందుకోసం తమరు కృషి చేయాలి. విద్యా, ఉద్యోగాలపై 50% సీలింగ్ సుప్రీం కోర్టు విదించింది. కావున తమరు అసెంబ్లీలో బిల్లు పెట్టి రాజ్యాంగ సవరణ కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాము.బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి - రాజ్యసభ సభ్యుడు ఉ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యజాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, రాష్ట్ర బీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, రామ్మూర్తి గౌడ్, రామకోటి, జిల్లా నరేందర్ నిఖిల్ తదితరులు

భూ సమస్యల పరిష్కరం కోసం రెవెన్యూ సదస్సులు

నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్

ఇబ్రహీంపట్నం,4 జూన్ (తెలంగాణ గీతం) ఇబ్రహీం పట్నం నియోజకవర్గ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కరం కోసం భూ భారతి రెవెన్యూ సదస్సును రెండవ రోజు ఇబ్రహీంపట్నం మండలం కప్పాడు గ్రామంలో నిర్వహించామని ఇబ్రహీం పట్నం నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బుధవారం ఆర్డీఓ, తహసీల్దార్ ఆదేశాల మేరకు ఇబ్రహీం పట్నం మండలంలోని పలు గ్రామాలతోపాటు కప్పాడు గ్రామంలో రెండవ రోజు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో ఉన్న చిన్న చిన్న రెవెన్యూ సమస్యలకు కార్యాలయాల వద్దకు రాకుండా ఈ సదస్సులోనే సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. నోటీస్ ఇవ్వాల్సి ఉన్న సమస్యలను నోటీస్ లు అందజేసి త్వరలో పరిష్కారం చేస్తామన్నారు. ఈ రెవెన్యూ సదస్సులను రైతులు, భూ యజమానులు సద్వయనియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ఆర్వోఆర్ చట్టం ప్రకారమే ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రధానంగా రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చే దరఖాస్తులను క్రమబద్ధంగా స్వీకరిస్తున్నామని వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, విచారణ చేపడుతున్నామని తెలిపారు. దరఖాస్తుదారులు ఇచ్చిన ఫిర్యాదులో అనుమానాలుంటే నివృత్తి చేసుకొని వివరాలు సేకరిస్తునామని తెలిపారు.

సమస్యలు ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గత రెండు రోజుల నుంచి ప్రారంబించిన ఈ రైతు సదస్సు ఈ నెల జూన్ 23వ తేదీ వరకు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని ప్రతి మండలంలో తహశీల్దార్, నాయబ్ తహశీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తారు. అలాగే భూ భారతి చట్టం అనుసారం దరఖాస్తులను తక్షణమే పరిష్కరించబడడం జరుగుతుందని తెలిపారు. కావున భూ సమస్యలు గల రైతులు మీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించే రోజున మీ దరఖాస్తులను అందించినట్లయితే సమస్యను పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భూ సమస్యలు ఉన్న రైతులు వినియోగించుకోగలరని ఇబ్రహీంపట్నం నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్ గౌడ్ కోరారు.

అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

రహదారులపై సమగ్ర సమీక్షా సమావేశం

హైదరాబాద్ 4జూన్ (తెలంగాణ గీతం) తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నేతృత్వంలో నేడు సచివాలయంలో హైబ్రిడ్ అన్యుటి మోడల్ హెచ్.ఏ.ఎం కింద రూపొందించిన రహదారుల ప్రాజెక్టులపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించబడింది. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, మరియు ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ హరిచందన దాసరి పాల్గొన్నారు. రోడ్లు మరియు భవనాల శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొని ప్రాజెక్టుల పురోగతిపై వివరాలు వెల్లడించారు. సమీక్షలో చర్చించిన ముఖ్యమైన విషయాలు హెచ్.ఏ.ఎం మోడల్ కింద చేపట్టాల్సిన రహదారుల ప్రాజెక్టులపై క్యాబినెట్ ఆమోదం కోసం తీసుకోవలసిన చర్యలపై చర్చ జరిగింది. హెచ్.ఏ.ఎంఫేస్ 1లో మొత్తం 5,190 కిలోమీటర్ల రహదారులను గుర్తించామని, వీటికి సంబంధించిన డిటైల్డ్ ఎస్టిమేట్లు, అమలు విధానాలు, ఫండింగ్ పద్ధతులు తదితర అంశాలపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాలు మరియు పట్టణ ప్రాంతాల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా, తక్కువ కాలపరిమితిలో నాణ్యమైన రహదారులు నిర్మించాలన్నదే ఈ హెచ్.ఏ.ఎం మోడల్ లక్ష్యం. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, హెచ్.ఏ.ఎం ద్వారా రాష్ట్రంలోని ఆర్.ఎన్.బి మరియు పంచాయతీ రోడ్ల అభివృద్ధికి మహర్దశ రానుంది. ప్రజల ప్రయాణం సురక్షితంగా, వేగంగా, సౌకర్యవంతంగా ఉండాలంటే పాట్‌హోల్స్ లేని నాణ్యమైన రహదారులు అవసరం. అదే దిశగా ఈ ప్రాజెక్టులు రూపొందించబడ్డాయి" అని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా, పట్టణ - గ్రామీణ ప్రాంతాల మధ్య బలమైన అనుసంధానాన్ని కల్పిస్తూ రాష్ట్ర వృద్ధికి దోహదపడేలా రోడ్ల నిర్మాణం జరుగుతుందని తెలిపారు.

భూ భారతితో రెవెన్యూ సమస్యలకు చెక్?

తెలంగాణ గీతం 4 జూన్ :రంగారెడ్డి బ్యూరో : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందుబాటులోకి తీసుకొచ్చిన భూ భారతితో రెవెన్యూ సమస్యలకు చెక్? పెట్టాలని భావిస్తోంది. గత నెల 5వ తేదీ జిల్లాలో కొందర్గు మండలంలో పైలట్? ప్రాజెక్ట్?గా ప్రారంభించి విజయవంతంగా ముందుకు సాగింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం భూ భారతిని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వ హించి సమస్యలకు పరిష్కారం చెప్పా లని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని రెవెన్యూ అధికారులు 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్దం చేసుకున్నారు. ప్రతీ మండలంలో రెండు టీముల చొప్పున ప్రతి గ్రామంలో సదస్సు ఉండేలా అధికారులు మ్యాప్? రూపొందించుకున్నారు. ఒక టీమ్? మండల తహశీల్దార్, మరో టీమ్? మండల డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు.

నూతన ఆర్వోఆర్ చట్టం ప్రకారమే..

ప్రభుత్వం నూతనంగా తెచ్చిన ఆర్?వోఆర్? చట్టం ప్రకారమే ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చే దరఖాస్తులను క్రమబద్ధంగా స్వీకరించాలి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, విచారణ చేపట్టాలి. దరఖాస్తుదారులు ఇచ్చిన ఫిర్యాదులో అనుమానాలుంటే నివృత్తి చేసుకొని వివరాలు సేకరించాలి. సదస్సులు నిర్వహించే ప్రాంతంలో ముందు రోజు ఆ గ్రామంలో విస్తృతంగా ప్రచా రం చేయాలి. సదస్సుకు హాజరై రైతుల కు, బాధితులకు సరిపోయేలా మౌలిక సదుపాయాలు కల్పించాలి. అంతేకాకుండా సదస్సులో పాల్గొనే అధికారులు ప్రత్యేకంగా ఒక కౌంటర్?, హెల్ప్? డెస్క్?లను ఏర్పాటు చేయాలి. దరఖాస్తుదారులు ఇచ్చే దరఖాస్తులు సరియైన ఫార్మాట్‌లో ఉండే లా చూడాలని కలెక్టర్? సూచించారు. ఆ దరఖాస్తులన్నీ విధిగా కంప్యూటర్?లో పూర్తి డేటాను ఆన్?లైన్? ద్వారా పొందుపర్చాలి. ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా నిజమైన రైతులకు తక్షణమే ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

నిబద్ధతతో ఆరోపణలకు తావులేకుండా సదస్సులు నిర్వహించాలి..

ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు తావు లేకుండా, విచారణ ప్రక్రియను పూర్తి నిబద్ధత, నిజాయితీగా నిర్వహించాలని సూచించారు. అవకతవకలకు తావు కల్పిస్తే ప్రభుత్వ యంత్రాంగానికి, రెవెన్యూ వ్యవస్థకే చెడ్డ పేరు వచ్చే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఎ లాంటి ఒత్తిళ్లు, ప్రలోభాలకు తలొగ్గకుండా భూభారతి దరఖాస్తుల విచారణలో పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా రెవెన్యూ అధికారులు, సిబ్బంది అందరూ అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ అన్నారు. సంబంధిత అధికారులు పొరపాట్లు చేస్తే, బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని, సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడబోమని ఈ సందర్భంగా హెచ్చరించారు. భూ భారతి చట్టంలో అప్పీల్ వ్యవస్థను అమలు చేస్తున్నందున, ప్రతి దరఖాస్తును ఎంతో జాగ్రత్తగా పరిష్కరించాల్సి ఉంటుందని, దరఖాస్తుదారుడు తిరిగి అప్పీలుకు వెళ్లే పరిస్థితి ఉత్పన్నం కాకుండా నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ జరిపి వాస్తవ పరిస్థితులతో కూడిన అభిప్రాయాలను నివేదికలో పేర్కొనాలని కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ ప్రక్రియలు నిర్వహించే సమయంలో ప్రతి ఒక్కరూ సంయమనంతో వ్యవహరించాలన్నారు. సాదాబైనామాలు, పీఓటీ దరఖాస్తులకు సంబంధించి రికార్డుల పరిశీలన, ప్రభుత్వం వెలువరించే మార్గదర్శకాలకు అనుసరిస్తూ సాదాబైనామా, పీఓటీలను క్రమబద్ధీకరించడం జరుగుతుందని దరఖాస్తుదారులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఒకే దరఖాస్తులో ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో భూ సమస్యలను పొందుపరిస్తే, ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిశీలిస్తూ వేర్వేరుగా విచారణ జరపాలన్నారు. ప్రభుత్వ భూములను, అసైన్డ్ భూములను పరిరక్షించాలని అన్నారు. రెవెన్యూ సదస్సు లు రైతులకు, ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహించాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచించారు.

సద్వినియోగం చేసుకోవాలి.జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేటి నుంచి జూన్ 3వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు జిల్లాలోని ప్రతి మండలంలో తహశీల్దార్, నాయబ్ తహశీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తారు. అలాగే భూ భారతి చట్టం అనుసారం దరఖాస్తులను తక్షణమే పరిష్కరించబడడం జరుగుతుందని కలెక్టర్ నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కావున భూ సమస్యలు గల రైతులు మీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించే రోజున మీ దరఖాస్తులను అందించినట్లయితే పార్టీ సమస్యను పరిష్కరించేందుకు వీలుంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భూ సమస్యలు ఉన్న రైతులు వినియోగించుకోగలరని కలెక్టర్ కోరారు.

మహిళలను ధనవంతులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఏమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం,4 జూన్ (తెలంగాణ గీతం) ఇబ్రహీంపట్నం ప్రజా భవన్ లో ఇబ్రహీంపట్నం,మంచాలలోని పలు గ్రామాలకు చెందిన 202 మంది కళ్యాణ్ లక్ష్మి,షాది ముబారక్ లబ్దిదారులకు 2కోట్ల 2లక్షల 23వేల నాలుగువందల మూపై రెండు రూపాల చెక్కులను అందజేసిన ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి.ఈ సందర్భంగా మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. 500లకే గ్యాస్, ఉచిత కరెంట్, ఉచిత రేషన్ బియ్యం, ఇప్పుడు మహిళలకు ఐదులక్షల రూపాయల ఇందిరమ్మ ఇల్లును ఇస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ముఖ్యంగా నిరుపేద కుటుంబలకు చెందిన వారికి పెళ్లి చేస్తే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటి పెద్దల లక్షపదహారులు ఇస్తున్నారని త్వరలో తులం బంగారం కూడ ఇస్తుందాన్నారు. ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అనీ మహిళలను ధనవంతులను చేయడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం,మంచాల తహసీల్దార్లు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలి:ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం,4 జూన్(తెలంగాణ గీతం) వాహనదారులు రోడ్డు భద్రత నియ మాలు పాటించాలని, నెంబర్ల ప్లేట్ లేకుండా తిరిగితే చర్యలు తీసుకొంటామని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పేర్కొన్నారు.బుధవారం కోహెడ ఎక్స్ రోడ్డు వద్ద సిఐ జగదీష్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. నెంబర్ ప్లేటు సరిగా లేని, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. కార్లకు బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు.ఈ సందర్భంగా ఏసీపీ రాజు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు.

గ్రామీణ ప్రాంత క్రీడాకారులు మట్టిలో మాణిక్యం లాంటివారు....

మంది క్రీడాకారులకు క్రీడ దుస్తులు పంపిణీ చేసిన: ఐరన్ హార్స్ సంస్థ వ్యక్తులు భరత్ , కిషోర్

శంకర్ పల్లి: : శంకర్పల్లి మండల పరిధిలోని మోకిలా రైతు వేదికలో జరుగుతున్న వేసవి కాలపు వాలీబాల్ శిక్షణ శిబిరం 33వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రముఖ కంపెనీ ఐరన్ హార్స్ సంస్థ యాజమాన్య సభ్యులు కిషోర్ మరియు భరత్ కలిసి శిబిరంలో పాల్గొంటున్న 85 మంది బాలబాలికలకు వాలీబాల్ క్రీడా దుస్తులు అందజేశారు. కిషోర్ మరియు భరత్ మోకిలాలోని లాపలోమా విల్లాస్‌లో నివసిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ,మేము చిన్నప్పుడు ఇలాంటి క్రీడా శిబిరాలు, సహకారాలు లేవు. చదువు మీదే మొత్తం దృష్టి ఉండేది. కానీ ఇప్పుడు పిల్లలు క్రీడల్లోనూ నైపుణ్యాన్ని పెంచుకుంటున్నారు. నేటి బాలలే రేపటి సమాజాన్ని నిర్మించే పౌరులు అని అన్నారు. క్రీడల ద్వారా పౌరులుగా ఎదిగే మార్గంలో బాలలకు ఇచ్చే ప్రోత్సాహం అభినందనీయం అని ఉపాధ్యాయులు, శిక్షకులు అభిప్రాయపడ్డారు. ఈ శిబిరం గ్రామీణ యువతకు ఆటల పట్ల ఆసక్తిని పెంచే గొప్ప వేదికగా నిలుస్తుందని వాళ్లు అన్నారు.

సమాజంలో న్యాయవాద వృత్తికి ప్రత్యేక స్థానం ఉంది.....

మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి......

శంకర్ పల్లి : . బుధవారం నాడు శంకర్ పల్లి లో సీనియర్ న్యాయవాది ఉపేందర్ రెడ్డి,జీతేందర్ రెడ్డి లు ఏర్పాటు చేసిన నూతన 'యూ జె'లా ఛాంబర్ ని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సత్వర న్యాయ సేవలు అందేలా చొరవ చూపాలన్నరు.సమాజంలో న్యాయవాద వృత్తికి ఎంతో గౌరవం ఉందని అటు కక్షిదారునికి,ఇటు న్యాయ మూర్తులకు మధ్య ఉంటూ న్యాయం కోసం పనిచేయటం గొప్ప విషయం అన్నారు.ఈ ప్రాంతంలో సీనియర్ లాయర్ గా ఉపేందర్ రెడ్డి అందిస్తున్న సేవలు ఎంతో గొప్పవని,మరింతగా రాణించి పెరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ఉపేందర్ రెడ్డి సోదరులను అభినందించారు.యువ న్యాయవాదిగా ఉపేందర్్ %ఖుషష%!రెడ్డి,జీతేందర్ రెడ్డి లకు మంచి భవిష్యత్తు ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ క్రిష్ణారెడ్డి,సొసైటీ చైర్మన్ శశిధర్ రెడ్డి,మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గోవర్ధన్ రెడ్డి,సొసైటీ డైరెక్టర్లు మహేందర్ రెడ్డి,శారద, మాజీ జడ్పీటీసీ కె నారాయణ,మాజీ ఎంపీపీ నర్సింలు,మాజీ మార్కెట్ చైర్మన్లు ప్రకాష్ గుప్తా, మానిక్ రెడ్డి,పాపారావు,,జిల్లా జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షులు ఎం డి సలీమ్ పాషా,మాజీ సర్పంచ్ లు వెంకట్ రెడ్డి,శ్రీధర్,సురేష్,నరసింహా రెడ్డి,మానిక్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి,నరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్,పాండురంగ రెడ్డి,బాల కృష్ణ,ముకుంద రెడ్డి, కృష్ణ రెడ్డి, రవీందర్, చేవెళ్ల బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.